



బులియన్ మార్కెట్‌కు పండుగ కళ

వరలక్ష్మీ వ్రతానికి భారీగా లక్ష్మీ ప్రతిమల అమ్మకాలు

గత ఏడాది గ్రాము రూ.6,500, నేడు రూ.10 వేలు.. చాలామంది అర గ్రాముతో సరి

నరసాపురం పట్టణంలోని ఐదో వార్డుకు చెందిన ఓ మధ్య తరగతి మహిళ ప్రతి ఏడాది వరలక్ష్మి వ్రతానికి గ్రాము బంగారంతో ప్రతిమ చేయించుకోవడం అనవాయితీ. అయితే ఈ ఏడాది ధర రెట్టింపు కావడంతో రూ.6 వేలు పెట్టి అర గ్రాము ప్రతిమనే చేయించుకుంది.

పాలకొల్లు చెందిన ఓ మహిళా ఉపాధ్యాయురాలు ప్రతి ఏడాది జీతంలో దాచుకున్న సొమ్ముతో పండుగకు రెండు కాసులతో ఏదో ఒక వస్తువును కొనేది. ఇందుకు రూ.లక్ష వరకు దాచుకునేది. ఈ ఏడాది దాచుకున్న సొమ్ముకు పది గ్రాముల బంగారం మాత్రమే లభించింది. దీంతో రెండు కాసులకు బదులు చిన్న వస్తువుతో సరిపెట్టుకుంది.

ఇలా పసిడి పెరగడంతో చాలా మంది వరలక్ష్మి వ్రతానికి అర గ్రాము ప్రతిమలే కొనుగోలు చేస్తున్నారు. స్తోమత ఉన్న వారు గ్రాము, రెండు గ్రాములతో లక్ష్మీ దేవి బొమ్మతో కూడిన రూపులను చేయించుకుంటున్నారు.

(నరసాపురం-ఆంధ్రజ్యోతి):

రెండు రోజుల క్రితం ప్రభుత్వం అన్నదాత సుఖీభవలో ప్రతి రైతు ఖాతాకు రూ.7 వేలు చొప్పున జమ చేసింది. చాలా మంది రైతు కుటుంబానికి చెందిన మహిళలు ఈ సొమ్ముతో అర గ్రాము లక్ష్మీ దేవి రూపు చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల నుంచి జిల్లాలోని అన్ని జ్యువెలరీ దుకాణాల్లో పండుగ కళ సంతరించుకుంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే సందడి. ధరతో నిమిత్తం లేకుండా సెంటిమెంట్‌గా అర గ్రాము ప్రతిమనైనా కొనేందుకు వస్తున్నారు. వీటితోపాటు నల్లపూసలు, మెడలో బొందు వంటి వస్తువులను చేయించుకుంటున్నారు. మంగళవారం అయినప్పటికీ బులియన్ మార్కెట్‌లో సందడి కనిపించింది.



గ్రాముకు రూ.3 వేలు పెరుగుదల

గత ఏడాది గ్రాము ఆర్నమెంట్ బంగారం ధర రూ.6,500 పలుకగా, ఈ ఏడాది రూ.9,310 కి చేరింది. తరుగు, మేకింగ్ ఛార్జీలతో కలిపి గ్రాము ప్రతిమ రూ.9,600 అవుతుంది. అదే అర గ్రాముతో రూ.5 వేలు వరకు పలుకుతోంది. ఎక్కువగా అర గ్రాము ప్రతిమలే అమ్ముడువుతున్నాయి. ముందుగా మార్కెట్‌ను అంచనా వేసినా.. వ్యాపారులు వీటినే ఎక్కువ మొత్తంలో స్టాక్ పెట్టారు. తర్వాత గ్రాము ప్రతిమలు అమ్ముడవుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఆర్నమెంట్ వస్తువులకు పెద్దగా డిమాండ్ లేదని వ్యాపారులు చెబుతున్నారు. రానున్న రెండు రోజుల్లో డిమాండ్ మరింత పెరగవచ్చునని అంచనా వేస్తున్నారు.



నరసాపురం
జ్యువెలరీ షాపులో రద్దీ



తణుకు జిల్లా ఆసుపత్రిలో
మూలనపడ్డ తల్లీబిడ్డ
ఎక్స్‌ప్రెస్ వాహనాలు

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కుదుపులు

- 14 వాహనాలకు పనిచేసేవి తొమ్మిదే
- మరమ్మతులు లేక మూలనపడ్డ ఐదు
- నాలుగు నెలలుగా జీతాల పెండింగ్

తణుకు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు మరమ్మతులతో మూలనపడ్డాయి. మరమ్మతులకు గురైతే ఈ వాహనాన్ని పట్టించుకునే వారే లేరు. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఫలితాలు అందడం లేదు. ప్రభుత్వాసుపత్రిలో గర్భవతి బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తల్లీ బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చాలనే బృహత్తర లక్ష్యంతో దీనిని ప్రవేశపెట్టారు. రాను రాను ఈ పథకం నిర్వహణలో చాలా ఇబ్బందులు ఎదురవుతు న్నప్పటికి ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. వాహనాలకు టైర్లు అరిగిపోవడం, ఇంజన్ మరమ్మతులకు రావడం వంటి సమస్యలకు పరిష్కారం చూపించడం లేదు. దీంతో ఆయా వాహనాలు మూలనపడ్డాయి. ఈ కారణంగా అవి భవిష్యత్‌లో మరింత పాడయ్యే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 14 వాహనాలు వున్నాయి. తణుకులో ఆరింటికి మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన మూడింటికి టైర్లు అరిగిపోయి పక్కన పెట్టేశారు. తాడేపల్లిగూడెంలో రెండింటికి ఒకటి మాత్రమే పనిచేస్తోంది. మరొకటి మరమ్మతులకు గురైంది. పెనుగొండలో ఒకటి, ఆచంటలో మరొకటి ఉన్నాయి. ఆచంట వాహనానికి డ్రైవర్ రెండేళ్ల క్రితం చనిపోయినప్పటికి ఆయన స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. పాలకొల్లు ఒకటి, భీమవరం ఒకటి, నరసాపురంలో రెండు ఉన్నాయి. మొత్తం 14 వాహనాలకుగాను, ఐదు పనిచేయడం లేదు. మరోవైపు తిరుగుతున్న వాహనాలకు కూడా చిన్నపాటి మరమ్మతులు ఉన్నాయని, వాటిని బాగు చేయించాలని కోరుతున్నారు. పనిచేయని చోట తల్లీబిడ్డలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు ఈ వాహన డ్రైవర్లకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఆగస్టు కలిస్తే మొత్తం ఐదు నెలలు అవుతుంది. ఒక్కో డ్రైవర్‌కు నెలకు అన్ని కటింగ్‌లు పోనూ 7 వేల 800 మాత్రమే వస్తుంది. ఇది కూడా సరిగా ఇవ్వకపోతే తామెలా బతకాలని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే అరకొర జీతాలతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా జీతాలు పెంచి, వాటిని సకాలంలో అందించాలని వారు కోరుతున్నారు.

25 నుంచి రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ !

భీమవరం టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):పాత రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్టు సమాచారం. కొత్త కార్డులు ఇవ్వనున్న నేపథ్యంలో పాత కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. అవసరమైన వారు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో ఐదు లక్షల 58 వేల 019 కార్డులు ఉన్నాయి. వీటికి రేషన్ అందిస్తున్నారు. వీటితోపాటు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు 5 వేల 376 మందికి, స్ప్లిట్ అయిన 5 వేల 232 మందికి కలిపి మొత్తం 10 వేల 608 మందికి స్మార్ట్ కార్డులు రానున్నాయి. కొత్తగా ఆమోదించిన రేషన్ కార్డులకు రేషన్ అందుతోంది. వీరు తమ ఆధార్ కార్డును రేషన్ డిపో వద్దకు తీసుకువెళితే మిషన్‌లో వివరాలు నమోదు చేసి రేషన్ అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. స్ప్లిట్ కార్డుల వారు రేషన్ షాపులకు వెళ్లి పరిశీలించుకోవాలి. రైస్ కార్డులకు సంబంధించి సచివాలయాల ద్వారా వచ్చిన దరఖాస్తులు 46,950 రాగా 37,565 ఆమోదించారు. 7,840 రిజెక్ట్ చేశారు. 1,545 పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు తెలిపారు.

తరచూ కొత్త విధానాలతో కక్షిదారుల అసంతృప్తి
7 ఓటీపీలు వస్తేనే రిజిస్ట్రేషన్లు

మద్యం సేవించి వాహనం నడిపిన ఏడుగురికి జరిమానా

భీమవరం క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): భీమవరం కొత్త బస్టాండ్ వద్ద ఈ నెల నాలుగో తేదీ రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కారు డ్రైవర్, ఆటో డ్రైవర్, ఐదుగురు ద్విచక్ర వాహనదారులను భీమవరం స్పెషల్ జ్యుడీషియల్ రెండో తరగతి మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి ఎంవీఎన్ రాజారావు ఏడుగురికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్టు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపటం వల్ల నడిపే వ్యక్తికే కాకుండా ఎదుటివారు కూడా ప్రమాదాలకు గురవుతారని, ప్రతి ఒక్కరిపై వారి కుటుంబం ఆధారపడి ఉంటుందని సూచించారు. తనిఖీల్లో తనతోపాటు ఎస్ఐలు కిరణ్‌కుమార్, కృష్ణాజీ, సిబ్బంది పాల్గొన్నట్టు చెప్పారు.

6 భయపెడుతున్న వంతెనలు



వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ

అత్తిలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజలకు తెలిసేలా ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజలు అత్తిలిలో భారీ ర్యాలీ నిర్వహించారు. 'వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ప్రజలలో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 535 గ్రామ సచివాలయాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 550 సర్వీసులను ప్రజలు పొందవచ్చు. పేపర్‌లెస్ గవర్నెన్స్‌లో భాగంగా డిజిటల్ గవర్నెన్స్ సేవలు అందించేందుకు సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి శ్రీకారం చుట్టారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ తదితర శాఖల సేవలను పొందవచ్చు. జిల్లాలో ఇప్పటి వరకు రెండు వేల అప్లికేషన్లు వాట్సాప్ ద్వారా వచ్చాయి'అని రాహుల్‌కుమార్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారి కె.మురళీకృష్ణ, తహసిల్దార్ వంశీ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాస్, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

నార్నిమెరక సొసైటీలో అక్రమాలు

- రూ.27.25 లక్షలు అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ

యలమంచిలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):నార్నిమెరక సహకార సంఘంలో అక్రమాలు జరిగినట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్, నార్నిమెరక సొసైటీ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ కె.జోసెఫ్‌పాల్ తెలిపారు. సొసైటీలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో త్రిసభ్య కమిటీ ఛైర్మన్ దేగల సత్యనారాయణ మాట్లాడుతూ గోల్డ్ లోన్లు, ఎల్.టి.డి.డి.ఎస్ లోన్లకు సంబంధించి 27 లక్షల 25 వేల 391 రూపాయల మేర అవకతవకలు జరిగాయని యలమంచిలి కో ఆపరేటివ్ బ్రాంచి మేనేజర్ వి.నర్సిరెడ్డి గుర్తించడంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో తేలిన మొత్తాన్ని కార్యదర్శి చవ్వాకుల శ్రీనివాసరావు నుంచి రికవరీ చేసినట్లు చెప్పారు. అక్రమాలపై 52 విచారణ జరుగుతుందని, నిజనిర్ధారణ చేసి అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. త్రిసభ్య కమిటీ సభ్యులు ఏడిది నారాయణరావు, పూరిళ్ల మాణిక్యాలరావు, వి.నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఆక్వా జోన్ సర్వే పూర్తి చేయాలి

భీమవరం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):నిబంధనల మేరకు నిర్ణీత సమయంలో ఆక్వాజోన్ సర్వే పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. తన చాంబర్ నుంచి మంగళవారం మత్స్య, గృహ నిర్మాణ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మండల లెవెల్ కమిటీ అధికారులంతా ఆక్వా జోన్‌లో ప్రతిపాదించిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమృద్ధిగా పండే వ్యవసాయ భూమిని ఆక్వా జోన్‌లోకి ప్రతిపాదించవద్దని ఆయన అధికారులకు సూచించారు. ఇచ్చిన లక్ష్యం మేరకు మూడు రోజుల్లోగా ఇళ్ల శ్లాబ్‌లు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.


స్వామిత్వ సర్వేకు శ్రీకారం

- రెండో విడతలో 200 గ్రామాల ఎంపిక
- ఇళ్లు, ఖాళీ స్థలాలకు పీపీఎన్ నెంబర్లు
- యాజమాన్యాల హక్కుల కోసం.. బ్యాంకుల నుంచి రుణార్హతకు ఈ సర్వే ఉపయోగం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్ (స్వమిత్వ) పథకంలో భాగంగా రెండో విడత సర్వేకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం జిల్లాలో 200 గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారు. గ్రామ కంఠంలో అనాదిగా నివాసాలు ఉంటున్నప్పటికీ కొందరికి హక్కు పత్రాలు లేవు. వారు పన్నులు చెల్లిస్తున్నప్పటికి యాజమాన్య హక్కులు లేకపోవడంతో బ్యాంకుల నుంచి రుణార్హత పొందలేకపోయారు. ఇలాంటి సమస్యలకు స్వమిత్వ సర్వేలో పరిష్కారం లభిస్తుంది. హక్కు పత్రాలు లేని వారికి తమ నివాసంలో పీపీఎన్ నెంబర్‌కు కేటాయిస్తారు. పట్టాలున్న వారికి నెంబర్‌లు, కార్డులు జారీచేస్తారు. యజమాని ఫొటోతోపాటు, విస్తీర్ణం, హద్దులతో కూడిన సమగ్ర వివరాలు ఉంటాయి.

గత ప్రభుత్వ హయాంలోనూ స్వమిత్వ సర్వే నిర్వహించినప్పటికి ఎన్నో అపోహలు రేకెత్తాయి. వ్యవసాయ భూముల రీసర్వేలో ఇచ్చే పాస్ పుస్తకాల్లోనూ, సరిహద్దుల రాళ్లపైనా జగన్ బొమ్మలు ముద్రించారు. భూసమస్యల పరిష్కారాన్ని, హక్కులను నిర్ధారించే హక్కులను అధికారులకు కల్పించారు. సొంత భూములు, ఆస్తులపై హక్కులు కోల్పోతామన్న ఆందోళన అందరిలోనూ ఏర్పడింది. ఇప్పటికీ ఆ సమస్యలు వెంటాడుతున్నాయి. రీసర్వేలో తప్పిదాలను కూటమి ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నం చేస్తోంది. స్వమిత్వ సర్వేలోనూ గ్రామ కంఠంలోని భూముల వివరాలను సేకరించనున్నారు. పంచాయతీల్లో ప్రజలను అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నారు,



సొంత భూమి వరకే హక్కు

గ్రామాల్లో నివాసాలు ఏర్పరచుకున్న వారంతా ముందు భాగాలను ఆక్రమించుకునే పరిస్థితి ఉంది. డ్రెయిన్‌లపైన ర్యాంప్‌లు నిర్వహించడం, రహదారి హద్దుల వరకు మెట్లు నిర్మించుకోవడం సాధారణం అయ్యాయి. స్వమిత్వ సర్వేలో గ్రామ కంఠం లోని ప్రైవేటు భూమి వరకే కొలతలు తీసుకుంటారు. హద్దులను గుర్తిస్తారు. మ్యాపింగ్ చేస్తారు. యజమాని వివరాలను సేకరిస్తారు. నివాసాల మధ్యలో ఉండే ప్రైవేటు ఖాళీ స్థలాలకు సర్వే నిర్వహించి వరుస క్రమంలో ప్రాపర్టీ పార్శిల్ నెంబర్‌ను కేటాయిస్తారు. ఆ తర్వాత కార్డులు జారీచేస్తారు. అందులోనే స్థలం, నివాసాల వివరాలన్నీ ఉంటాయి. హద్దుల వివరాలు కార్డులో తెలుస్తాయి. దీనివల్ల భూయజమానులకు తమ స్థలాలు, నివాసాలపై పూర్తిస్థాయి పారదర్శకత ఉంటుంది. హద్దుల గొడవలకు పరిష్కారం లభిస్తుంది. పన్నుల వసూళ్లు సులభతరం అవుతుంది. అవకతవకలకు ఆస్కారమే ఉండదు. పంచాయతీలకు పూర్తిస్థాయిలో పన్ను జమ అవుతుంది. ఆన్‌లైన్‌లోనే పన్ను తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం స్వమిత్వ సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత ప్రభుత్వం సర్వే

(మిగతా 8వ పేజీలో)

200 గ్రామాల్లో సభలు

- రెండో విడత స్వమిత్వ సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా ఆరు వేల గ్రామాలను లక్ష్యంగా పెట్టుకున్నారు.
- జిల్లాలో 409 గ్రామ పంచాయతీలకు గాను స్వమిత్వ సర్వే కోసం 295 గ్రామాలను ఎంపిక చేశారు.
- గత ప్రభుత్వ హయాంలో 43 గ్రామాల్లో సర్వే పూర్తికాగా, మరో 15 గ్రామాల్లో చేపడుతున్నారు.
- రెండో విడత స్వమిత్వ కోసం 200 గ్రామాలను ఎంపిక చేసి గ్రామసభలను నిర్వహిస్తున్నారు.
- గ్రామం కంఠంలో ప్రైవేటు భూములను సర్వే చేసి, హద్దులు గుర్తిస్తారు.
- జనవరి నాటికి పీపీఎన్ కార్డులను జారీ చేసేలా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

పాత్రికేయుల సమస్యలు పరిష్కరిస్తా

- మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):పాత్రికేయుల సమస్యలపై వచ్చే మంత్రి వర్గ సమావేశంలో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే పిలుపు మేరకు పాలకొల్లు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీలు అధికారంలోకి రావడంలో పాత్రికేయుల పాత్ర కీలకంగా ఉందన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా 'విలేకరులకు అక్రిడేషన్ల పునరుద్దరణ, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, పాఠశాలల్లో పిల్లలకు ఫీజు రాయితీ, 60 ఏళ్లు దాటిన వారికి పెన్షన్లు ఇవ్వడం వంటి పలు సమస్యలపై వినతి పత్రాన్ని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వి సాంబశివరావు, ఐజేయు సభ్యులు ముత్యాల శ్రీనివాస్ తదితరులు సమర్పించారు.



పాలకొల్లులో మంత్రి నిమ్మలకు వినతిపత్రం సమర్పిస్తున్న పాత్రికేయులు



కరపత్రాలు ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

10,11 తేదీల్లో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు

భీమవరంటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఈ నెల 10,11 తేదీల్లో భీమవరంలో జరగనున్నాయి. సమా వేశాలకు సంబంధించిన పోస్టర్లను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ విడుదల చేశారు. సమావేశాలకు రాష్ట్రం నలుమూలల నుంచి 250 మందికి పైగా విద్యార్థి నాయకులు హాజరు కానున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలైన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలుపై సమావేశాల్లో చర్చించి తీర్మానాలు చేస్తారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ సమస్య, నూతన రోడ్ల నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు వంటి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా చర్చించి, ఒక తీర్మానాన్ని రూపొందిస్తారు. ఈ తీర్మానాలను రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రులకు అందజేయనున్నారు. ఏబీవీపీ ప్రాంత సంఘటన కార్యదర్శి సుమన్, జిల్లా ప్రముఖ్ జ్వాల శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ వెంకట్ పాల్గొన్నారు.



వెయిట్‌లిఫ్టింగ్‌లో ఏఆర్‌డీజీకే విద్యార్థుల ప్రతిభ

ఏలూరు టూటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఏఆర్‌డీజీకే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీల్లో 8వ తరగతి విద్యార్థి కే.భార్గవి 3వ స్థానం, మేఘన ద్వితీయ స్థానం, 9వ తరగతి చదువుతున్న పావని ప్రథమస్థానం సాధించారు. సీహెచ్ కీర్తన 58 కేజీల విభాగంలో ప్రథమ స్థానం, దీక్షిత 44వ కేజీల విభాగంలో ద్వితీయస్థానం ఎస్‌డీ మహీన్ 48 కేజీల విభాగంలో ప్రథమస్థానం సాధించారు. సీహెచ్ నిహారిక రెడ్డి 63 కేజీల విభాగంలో ప్రథమస్థానం, ఎన్.విహారిక 77 కేజీల స్థానంలో ప్రథమస్థానం, పవిత్ర 58 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం, ఇందు 44 కేజీల విభాగంలో తృతీయస్థానం సాధించారు. అనూష 53 కేజీల విభాగంలో తృతీయ స్థానం, షేక్ ఆశాజ్యోతి 77 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం పొందారు. అథ్లెటిక్‌లో జే.పల్లవి ప్రథమ స్థానం పొందారు. వీరంతా త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు గుణ్ణంపల్లి విద్యార్థినులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు మండలంలోని గుణ్ణంపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం వరప్రకాశం తెలిపారు. ఈనెల 9 నుంచి 11 వరకూ బాపట్ల జిల్లాలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు వీరు ఎంపికయ్యారన్నారు. జిల్లాస్థాయిలో ఇటీవల ఏలూరులో జరిగిన పోటీలలో హైజంప్‌లో రోషిణి, లాంగ్ జంప్‌లో ఐశ్వర్య, 600 మీటర్ల పరుగులో రమ్యకృష్ణలు ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు.



ఘనంగా ఏకాదశి ఉత్సవం

ద్వారకాతిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉభయ దేవేరులతో చినవెంకన్నకు మంగళవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో జరిగిన ఏకాదశి ఉత్సవం భక్తులను అలరించింది. స్వామి, అమ్మవార్లను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా అట్టహాసంగా తిరువీధులకు తీసుకొచ్చారు.



పీచు పరిశ్రమకు మంచిరోజులు

కరోనా తరువాత కుదేలు
ధర పెరగడంతో తెరుచుకుంటున్న మూసివేసిన పరిశ్రమలు



దెందులూరు ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కరోనా దెబ్బకు కొబ్బరి పీచు పరిశ్రమలు మూతపడ్డాయి. ఇప్పుడిప్పుడే ధర కొంత ఆశాజనకంగా ఉండటంతో మళ్లీ పీచు పరిశ్రమలను నిర్వహిస్తున్నారు.కొబ్బరి పీచు పరిశ్రమ ద్వారా వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. దెందులూరు, పెదవేగి, ద్వారకా తిరుమల, అత్తిలి, ఉంగుటూరు తదితర మండలాల్లో పెద్దస్థాయిలో చిన్న తరహా కొబ్బరి పీచు పరిశ్రమలు ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం పీచు పరిశ్రమ ద్వారా సంవత్సరానికి ఏలూరు జిల్లాలో రూ.180 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగు తుండేవి. కరోనా తర్వాత అది రూ.130 కోట్లకు పడిపోయింది. నెలకు 18 టన్నుల ఉత్పత్తి చేస్తూ పరోక్షంగా 7 వేల మంది ఉపాధి పొందేవారు. కొబ్బరి పీచు ఉత్పత్తులను విశాఖ ఓడ రేవు ద్వారా విదేశాలకు ఎగుమతి చేసి విదేశీ మారక ద్రవ్యాన్ని పొందేవారు. కొబ్బరి పీచును ఎక్కువగా సోఫా సెట్లు, కార్పెట్లు. పరుపులు, తాళ్లు, తయారు చేయడానికి వినియోగిస్తారు. ప్రధానంగా మన రాష్ట్రం నుంచి చైనాకు కొబ్బరి పీచు ఎగుమతులు అవుతున్నాయి. ఇటీవల స్థానికంగా కుడా వీటి వినియోగం పెరగడంతో 30 శాతం ఉత్పత్తులను ఇక్కడే ఉపయోగిస్తున్నారు. కరోనా వల్ల ఎగుమతులు నిలిచిపోవడంతో కొబ్బరి పీచు పరిశ్రమ నిర్వాహకులు నష్టాలను చవిచూశారు. కొంతమంది అప్పుల పాలై పరిశ్రమలను మూసివేశారు. ఇటీవల కొబ్బరికి మంచి రోజులు వచ్చాయి. కొబ్బరి పీచుకు కిలో ధర రూ.8 నుంచి రూ.13లకు పెరగడంతో నిర్వాహకులు పరిశ్రమలను తిరిగి ప్రారంభిస్తున్నారు.

తయారీ ఇలా ..

కొబ్బరి తోటల నుంచి కూలీల ద్వారా కొబ్బరి డొక్కలను సేకరించి స్థానికంగా ఉన్న పరిశ్రమలకు చేరుస్తారు.ఇక్కడ యంత్రాల సాయంతో పీచును వేరు చేస్తారు. ఈ ప్రకియలో వచ్చిన కొబ్బరి పొట్టును ఇటుకల బట్టీలకు విక్రయిస్తుంటారు. పరిశ్రమ వద్దకు తెచ్చిన డొక్కను పీచు తయారు చేయాడానికి కనీసం నెల రోజుల వ్యవధి పడుతుంది.కిలో పీచుకు తయారు చేసేందుకు కూలీలు, యంత్రాల నిర్వహణ ఖర్చు రూ.8 అవుతుంది. కానీ ఆదాయమే రూ.8 నుంచి 9 రూపాయలు వస్తుండటంతో నిర్వాహకులకు ఏమీ మిగలక పోవడంతో పరిశ్రమలు తాత్కాలికంగా మూసివేశారు. ఇప్పుడు ధర బావుండటంతో తిరిగి ప్రారంభిస్తున్నారు.

- **ప్రతికూల వాతావరణంతో నష్టాలు**



వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న కొబ్బరి పీచు పరిశ్రమల నిర్వహణలో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ధర బాగానే ఉంది కదా అనుకునేలేపుగానే వర్షాల వల్ల ముడి సరుకు తడిసిపోతోంది. దీతో ఉత్పత్తి తగ్గి పోతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రాయితీ ఇచ్చి చిన్న పరిశ్రమలను ఆదుకోవాలి.

- గూడపాటి బీష్మ, యజమాని, మేదినరావుపాలెం

- **గోడౌన్లు లేక ఇబ్బందులు**



కొబ్బరి పీచు పరిశ్రమ చిన్న తరహా పరి శ్రమ. మార్కెట్ హెచ్చు తగ్గులు వల్ల ఎగుమతులు నిలిచిన సమయంలో తయారైన పీచును నిల్వ చేసుకునేందుకు గోదాములు లేక తయారైన పీచు వర్షాలకు తడసిపోతున్నది. అగ్ని ప్రమాదాల భారినపడి రూ.2 కోట్లు నష్ట పోయాం. చిన్న పరిశ్రమల నిర్వాహకులకు ప్రభుత్వాలు మరింత సహకారం అందించాలి.

- పెనుమత్స అచ్యుత రామరాజు, కొబ్బరిపీచు పరిశ్రమ నిర్వాహకుడు, జోగన్నపాలెం

భయపెడుతున్న వంతెనలు



ఆరవల్లిలో ప్రమాదకరమైన వంతెన

హెచ్చరిక బోర్డులేవి ?

అత్తిలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : తణుకు - భీమవరం, అత్తిలి- అలంపురం, ఉరదాళ్ల పాలెం- దువ్వ ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్రమాదకర మలు పులు ఉన్నాయి. ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇటీవల రేలంగి శివారు గవర్ల పాలెం నుంచి కె.సము ద్రపుగట్టు వరకు బీటీ రోడ్డు నిర్మించారు. ఇటీవల ఈ మార్గంలో వెళుతున్న కారు అదుపుతప్పి విద్యుత్ స్థంభాన్ని డీకొట్టింది. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు మలుపుల వద్ద, కాలువ వంతెనల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. ముఖ్యంగా మలుపులు, జంక్షన్లు, స్కూల్ జోన్లు, ఇరుకైన బ్రిడ్జిలు ఉన్నచోట్ల బోర్డులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. రేడియం స్టిక్కర్ల బోర్డులు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. కొత్త రహదారుల్లో ప్రయాణాలు చేసేవారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు.



బల్లిపాడులో మలుపు వద్ద బోల్తాపడిన కారు (ఫైల్)

ప్రమాదకరంగా పడమర విప్పర్రు బ్రిడ్జి

కింద భాగం ఊడి వేలాడుతున్న వైనం
భయపడుతున్న విద్యార్థులు, స్థానికులు



పెంటపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నిత్యం అవసరమయ్యే ప్రధాన వంతెనలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎప్పుడు పడిపోతాయా అన్నట్లుగా మారాయి. మండలంలోని పడమర విప్పర్రు బక్లెస్ డ్రైయిన్‌పై ఉండే వంతెన బీటలు వారి ప్రమాదకరంగా మారింది. ఈ గ్రామంలో ఉండే జడ్పీ ఉన్నత పాఠశాలకు నిత్యం విద్యార్థులు ఈ వంతెన పైనుంచే ప్రయాణం చేస్తుంటారు. వంతెన అవతల నివాసాలు ఉండేవారు, రైతులు నిత్యం ఈ వారధిపై నుంచే వెళ్తుంటారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుకుంది. వంతెన కింద భాగం కూడా రాళ్ళుగా ఊడిపోయి కిందకు వేలాడుతున్నాయి. వంతెనకు రెండుపక్కల ఉండే రైలింగ్ కూడా ఒక వైపునకు ఒరిగిపోయింది. దీంతో ఈ వంతెనపై ప్రయాణాలు సాగించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు, స్థాని కులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాప్యం జరిగితే ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. అధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

జిన్నూరు వంతెన శ్లాబ్‌కు బీటలు

రాకపోకలు బంద్

పోడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) :పురాతన కట్టడమైన జిన్నూరు వంతెనం శిథిలావస్థకు చేరింది. సుమారు 85 ఏళ్లనాటి జిన్నూరు వంతెనంపై నిత్యం వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉంటుంది. వంతెనం శ్లాబ్ బీటలు తీయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. స్థానిక నాయకులు వంతెన పరిస్థితిని పరిశీలించి స్కూల్ బస్సులు, వాహనాలను వంతెనపైకి రాకుండా చర్యలు తీసుకున్నారు.ఇరిగేషన్ శాఖ ఏఈ ఎస్.శ్రీనివాసు వంతెన పరిస్థితిని పరిశీలించారు. ఉన్నతాధికారుల సూచనలు మేరకు వంతెనపై వాహనాలు రాకపోకలను బంద్ చేసి వంతెనం ఇరు వైపులా వాహనాలు రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. వంతెనం శిథిలావస్థకు చేరడంతో గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొత్త వంతెన నిర్మాణానికి రూ.2.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు వంతెన నిర్మాణ పనులను ప్రారంభించి వంతెన నిర్మాణం పూర్తిచేశారు. వంతెనకు అప్రోచ్‌రోడ్డు వేయాల్సి ఉండగా తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే మంత్రి నిమ్మల రామానాయుడు కొత్త వంతెన అప్రోచ్‌రోడ్డు పనులపై దృష్టి పెట్టారు. రూ.1.40 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేశారు. రెండు నెలల్లో వంతెనం ప్రారంభించేందుకు మంత్రి అన్ని చర్యలు తీసుకున్నట్లు స్థానిక నాయకులు దేవళ్ల ప్రసాదు, దేవళ్ల శ్రీరామకోటి మోహన్, దాసరి రత్నరాజు, పాల వలస తులసీరావు తెలిపారు.





నెరలు తీసి కిందకి దిగుపోతున్న వంతెన శ్లాబ్

ఫలించిన చినమామిడిపల్లి వాసుల పోరాటం

ఫుట్ పాత్ వంతెనకు రైల్వే ఓకే

నరసాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన మామిడిపల్లి వద్ద మూసివేసిన రైల్వేగేట్ స్థలంలో ఫుట్ పాత్ వంతెన నిర్మాణం కోసం గ్రామ ప్రజలు చేస్తున్న పోరాటం ఫలించింది. నిర్మాణానికి ఎట్టకేలాకు రైల్వే అంగీకరించింది. మూసి వేసిన రెండు గేట్లను కలుపుతూ సుమారు 250మీటర్ల మేర ఫుట్‌పాత్ వంతెన నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. సైకిళ్లు, ఆటోలు, బైక్‌లు వెళ్లే విధంగా నిర్మించే ఈ వంతెనకు రూ 5 నుంచి రూ 6 కోట్లు వరకు ఖర్చు అవుతుందని అంచన. రైల్వేస్టేషన్‌కు సమీపంలోనే చినమామిడిపల్లి రైల్వేగేట్ ఉంది. బ్రిటిష్‌హాయం నుంచి ఈ గేటు కొనసా గుతుంది. నరసాపురం నుంచి మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లాలంటే ఈ మార్గం గుండానే వెళ్లాలి. రాష్ట్ర విభజన తరువాత ఈ రోడ్డును విస్తరించారు. దీంతో ట్రాఫిక్ పెరిగింది. అయితే విజయవాడ- నరసాపురం మధ్య డబ్లింగ్ లైన్ పనులు పూర్తికావడంతో రైల్వే గేట్‌ను మూసివేసింది. ప్రత్యామ్నాయంగా గేటు అవతల వైపునా రైల్వే స్థలాన్ని చూపించింది. ఆ మార్గం గుండా స్టేషన్‌పేట మీదుగా పట్టణానికి రోడ్డు మార్గాన్ని కల్పించింది. దీంతో ప్రజలకు గేటు సమస్య తీరింది. అయితే ఒకవైపు గేటు మూసివేయడంతో చినమామిడిపల్లిలో ఒక ప్రాంతం ప్రజలు మూసివేసిన అవుతల వైపుకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తుంది. చాలామంది రైతులకు అక్కడే పోలాలు ఉన్నాయి. దీనిపై అనేక మార్లు రైల్వే అధికారులకు విన్నవించారు. అందోళనలు చేశారు. నాలుగేళ్లుగా వీళ్ల చేస్తున్న పోరాటం చివరికీ ఫలిం చింది. మంజూరైన వంతెన నిర్మాణ స్థలాన్ని ఆర్డీవో దాసిరాజు, టీడీపీ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కౌన్సిలర్ పాలూరి బాబ్జీలు రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. మూసివేసిన రెండు గేట్లును కలుపుతూ నిర్మించే ఈ వంతె నపై చిన్న వాహనాలు వెళ్లే విధంగా డిజైన్ చేశారు. ప్రస్తుతం ఉన్న పట్టాలపై నుంచి ఈ వంతెన నిర్మాణ పనులు చేపట్ట నున్నారు. పనులు మొదలు పెడితే ఏడాది లోపు వంతెన నిర్మాణం పూర్తవుతుందని రైల్వే అధికారులు చెప్పుతున్నారు.



వంతెన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో దాసిరాజు, పొత్తూరి (ఫైల్)

మా పోరాటం ఫలించింది..



బ్రిటిష్ హయాం నుంచి చినమామిడిపల్లి వద్ద రైల్వేగేట్‌లు కొనసాగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం రైల్వే ఆకస్మికంగా మూసి వేసింది. దీంతో వార్డు రెండు ముక్కలైంది. రైల్వే వేసిన రోడ్ గ్రామాలకు వెళ్లే ప్రజలకు అనుకూలంగా ఉండే తప్ప చిన మామిడిపల్లివాసులకు కష్టాలు మాత్రం తీరలేదు. గేటు దాటాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తున్నది. అండర్ టన్నెల్ వేయాలని సీఎం చంద్రబాబుకు, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మకు విన్నవించారు. చివరకు వారు సానుకూలంగా స్పందించారు. వంతెన పూర్తయితే మా కష్టాలు తీరినట్లే.

- పాలూరి బాబ్జీ, కౌన్సిలర్



కాళీపట్నం లాకు శిథిలం

ఉప్పుటేరు నీరు పంట కాలువలోకి

మొగల్తూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జీఎస్‌వీ కెనాల్‌కు శివారు ప్రాంతంలో ఉన్న కాళీపట్నం లాకు తలుపులు పూర్తిగా శిథిలమై దశాబ్దన్నర కాలం పైబడినా ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. లాకు తలుపులు శిథిలమవ్వడంతో లాకు అవతల గల మాగలేరు డ్రెయిన్‌లోని ఉప్పునీరు జీఎస్‌వీ కెనాల్‌లోకి ప్రవహించి మంచినీటిని కలుషితం చేస్తున్నది. ఫలితంగా జీఎస్‌వీ కెనాల్ ద్వారా కోమటితిప్ప బహుత్తర మంచినీటి ప్రాజెక్టుకు, వరి సాగుకు, గృహ అవసరాలకు కాలువ నీరు నిరుపయోగంగా మారడంతో కాళీపట్నం రెవెన్యూ పరిధి ఆరు గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాళీపట్నం రెవెన్యూ పరిధిలో పంట నీరు అందని పరిస్థితి నేపథ్యంలో ఎక్కువ శాతం ఆక్వా చెరువులు తవ్వేశారు. కాళీపట్నం శివారు ప్రాంతం కావడంతో శిథిలమైన లాకు స్థానంలో రెగ్యులేటర్ నిర్మిస్తామని 14 సంవత్సరాల క్రితం అప్పటి రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య కాళీపట్నం వచ్చినప్పుడు రెగ్యులేర్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. రూ.90 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం రాష్ట్ర విభజున, ప్రభుత్వాలు మారడంతో రెగ్యులేటర్ నిర్మాణం అటకెక్కింది. కనీసం లాకు తలుపులు అయినా పునర్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటికి పాట్లు

ఏడాది పొడవునా సమస్యలే
మార్చని ఇసుక.. శుభ్రత లేని ఫిల్టర్ బెడ్లు..
శిథిలావస్థలో వాటర్ ట్యాంకులు
ఆకివీడు వాసుల నీటి కష్టాలు

ఆకివీడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు నగర పంచాయతీలో ఏడాది పొడవునా తాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయి. పట్టణ పరిధిలో ఇరవై వార్డుల్లో యాభై వేలకు పైబడి ఉన్న జనాభాకు ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం 18 లక్షల లీటర్ల తాగు నీరు సరఫరా చేస్తున్నారు. భుజబలరాయుడు స్టోరేజ్ ట్యాంకు, ఆనాల, గాలిబ్, ధర్మాపురం మంచినీటి చెరువులకు సంబంధించి కొన్నిచోట్ల ఫిల్టర్ బెడ్లలో ఏళ్లు గడుస్తున్నా ఇసుక మార్చకపోవడంతో రావాటర్ ఫిల్టర్ అవ్వడం లేదు. ఇసుక మూడేళ్లకొకసారి మార్చాల్సి ఉంది. తాగునీరు సరఫరా చేసే మెయిన్ (సిమెంట్) పైపులైన్ ఆరవై ఏళ్ల పైబడి కావడంతో అవి తరచూ పగిలిపోతున్నాయి. దీంతో మురుగునీరు మంచినీటి పైపులైన్లలో కలవడంతో తాగునీరు కలుషితమవుతోంది. ఆ నీటినే తాగి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అదనంగా ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం నాలుగు ట్యాంకులు శిథిలావస్థకు చేరుకోవడంతో తరచూ తాగునీరు వృథా అవుతోంది. మరో నాలుగు ట్యాంకులు కొత్తవి నిర్మిస్తే తాగునీటి సమస్య తీరుతుంది. మంచినీటి చెరువులకు అవుట్‌లెట్‌లు లేవు. జనరేటర్లు లేకపోవడంతో కరెంటు పోతే ఇబ్బంది ఎదురవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లు కూడా లేవు. పెద్ద, చిన్న పల్లె వీధులు, తెలగపాముల వీధి , రైల్వే స్టేషన్ ఎదురుగా, సమతానగర్, ఎఫ్‌సీఐ దగ్గరకు ఏడాది పొడవునా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. పట్టణంలో సుమారు ఎనభై శాతం బయట నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. కొందరు ఇళ్ళలోనే ఫిల్టర్ వేయించుకొని నీటిని తాగుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు పాలకవర్గం, అధికారులు దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవడం లేదని ప్రజానీకం వాపోతున్నారు.

- **పురుగులు కూడా వస్తున్నాయి**



కుళాయిల ద్వారా సరఫరా చేసే మంచి నీటిలో ఒక్కోసారి పురుగులు కూడా వస్తున్నాయి. మూడేళ్లకు ఒకసారి ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక మార్చాల్సి ఉండగా ఏళ్లు గడుస్తున్నా ఇసుక మార్చడం లేదు. దీంతో రావాటర్ ఫిల్టర్ కావడం లేదు. ఆ నీటినే సరఫరా చేస్తున్నారు. భుజబల రాయుడు చెరువు దగ్గర ఇన్‌టేక్ వెల్ శ్లాబ్ పగిలిపోయి చాలా కాలం అవుతున్నా మరమ్మతులు కూడా చేయించడం లేదు.

-బత్తుల శ్యామల, టీడీపీ కౌన్సిలర్, ఆకివీడు

- **ఏడాది పొడవునా ట్యాంకర్ల ద్వారా నీరు**



పట్టణ పరిధిలో పలు ప్రాంతాలకు సరైన పైపలైన్లు లేకపోవడంతో ఏడాది పొడవునా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. శివారు ప్రాంతాలకు కాకుండా పట్టణ నడిబొడ్డునున్న ప్రాంతాలకు కూడా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

నేరెళ్ళ ప్రసన్న,జన సేన కౌన్సిలర్, ఆకివీడు





ఫిల్టర్ బెడ్‌లో పచ్చగా కనపడుతున్న నీరు.. ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు



శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

ఇసుక టెండర్ దశలో ఉంది



ఫిల్టర్ బెడ్లకు ఇసుక మార్చడానికి టెండర్ దశలో ఉంది. 80 శాతం పైనే ఇసుక మార్చాం. అమృత్ 2.0 పథకం మంజూరైంది. ఆ నిధులతో పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం మవుతుంది. ఎమ్మెల్యే రఘురామరాజు నేతృత్వంలో రూ.30 కోటత్లో పైపులైన్ మరమ్మతులు ఆకివీడు వరకూ జరిగాయి. త్వరలోనే తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయి.

- జి.కృష్ణమోహన్, కమిషనర్, ఆకివీడు

సీఎం చంద్రబాబుతో 'గన్ని' భేటి



సీఎంను కలిసి పలు అంశాలను వివరిస్తున్న గన్ని వీరాంజనేయులు

ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి : కూటమిలో భాగస్వామ్య పక్షాల పనితీరు, జిల్లాలో నెలకొన్న వాస్తవ పరిస్థితులతో పాటు ఆప్కాబ్ వ్యవహారాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఆప్కాబ్ చైర్మన్, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వివరించారు. ఈ మేరకు ఆయన సీఎం చంద్రబాబును మంగళవారం కలిసిన సందర్భంలో ఈ అంశాలు చర్చకు రావడంతో తన దగ్గర ఉన్న సమాచారాన్ని సీఎంకు గన్ని తెలియజేశారు. జిల్లాలో కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య నెలకొన్న పరిస్థితులపై వీరిద్దరి మధ్య చర్చకు వచ్చాయి. తొలి అడుగు కార్యక్రమంలో జిల్లాలోనే ఉంగుటూరు తొలిస్థానంలో నిలవడాన్ని సీఎం ప్రస్తావించినప్పుడు మిగతా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు పట్టుదలతో ఈ కార్యక్రమాన్ని నిర్వర్తించాలని సీఎంకు గన్ని వీరాంజనేయులు వివరాలను తెలియజేశారు.

రేపు ఏలూరులో జేఏసీ-అమరావతి ఉమ్మడి జిల్లా సమావేశం

ఏలూరు అర్బన్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):ఉద్యోగులకు రావలసిన బకాయిలు, 12వ పీఆర్సీ నియామకం, ఐఆర్, పెండింగ్‌లో వున్న డీఏలు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు, టీచర్ల సమస్యలపై ఏపీ జేఏసీ-అమరావతి ఉమ్మడి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు సంఘ జిల్లా చైర్మన్ కె.రమేష్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరులోని రెవెన్యూ భవనంలో ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. అదేరోజున మధ్యాహ్నం మూడు గంటలకు రెవెన్యూ సర్వీసెస్ సంఘ కార్యవర్గసమావేశం, సాయంత్రం నాలుగు గంటలకు జిల్లాలోని తహసీల్దార్లు, ఉద్యోగుల సమస్యలపై సమావేశాలు జరుగుతాయన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు, జేఏసీ-అమరావతి కార్యవర్గ సభ్యులు, ఏపీఆర్ఎస్ఏ కార్యవర్గ సభ్యులు, అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయసంఘాల నాయకులు, ఉద్యోగులు, టీచర్లు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

'విద్యాశక్తి' బహిష్కరణకు 'ఫ్యాప్టో' నిర్ణయం

ఏలూరు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేసేవిధంగా 'విద్యాశక్తి' పేరిట విద్యాశాఖ తలపెట్టిన కార్యక్రమం ఐచ్ఛికమేనని ప్రభుత్వం సూచించినప్పటికీ జిల్లాలో కొందరు అధికారులు టీచర్లను ఒత్తిడిచేయడంపై ఏపీ ఉపాధ్యాయసంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ మేరకు మంగళవారం డీఈవో వెంకటలక్ష్మమ్మను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. టీచర్లను ఇబ్బందులకు గురిచేస్తున్న దృష్ట్యా జిల్లాలో విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు డీఈవోకు తెలియజేశామని ఫ్యాప్టో నాయకులు రవికుమార్, రెడ్డిదొర, పవన్‌కుమార్, రమేష్, తదితరులు తెలిపారు.

దువ్వ దానేశ్వరమ్మకు మంత్రి దుర్గేశ్ పూజలు



దువ్వ దానేశ్వరమ్మకు పూజలు చేస్తున్న మంత్రి దుర్గేశ్

తణుకు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దువ్వ గ్రామంలోని దానేశ్వరి అమ్మవారిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం పెరవలి మండల మాజీ వైస్ ఎంపీపీ నందిప చక్రవర్తి గత ఏడాది జరిగిన ఎన్నికలలో ఎమ్మెల్యేగా దుర్గేశ్ గెలుపొందాలని మొక్కుకున్నారు. ఆ మొక్కును చెల్లించుకునేందుకు మంగళవారం దానేశ్వరి అమ్మవారిని మంత్రి దుర్గేశ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, ఆలయ మర్యాదలతో మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదపండితుల ఆశీర్వచనం పలికారు. పూజల అనంతరం మంత్రికి అమ్మవారి చిత్ర పటాలను అందజేశారు. కార్యక్రమంలో పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసు, నాయకులు పాల్గొన్నారు.



శిక్షణ ముగింపులో పాల్గొన్న డీఎంహెచ్‌వో, ఉమ్మడి జిల్లా వైద్యాధికారులు, ప్రొఫెసర్లు

కేన్సర్ ముందస్తు నివారణపై ముగిసిన శిక్షణ

ఏలూరు అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ నివారణకు ముందస్తు గుర్తింపు కార్యాచరణ, అంటువ్యాధుల గుర్తింపు, నిర్ధారణ పద్ధతులపై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని గైనకాలజిస్టులు, డెంటల్ సర్జన్లకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎన్సీడీ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మూడు రోజులపాటు నిర్వహించిన పునశ్చరణ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం మాట్లాడుతూ నోటిలో పుండ్లు, రొమ్ముల్లో గడ్డలు కేన్సర్‌కు కారణం కావచ్చని, వీటిని తొలి దశలోనే గుర్తించినట్టయితే రోగిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చని పేర్కొన్నారు. సైలెంట్ కిల్లర్‌గా పరిగణించే కేన్సర్ లక్షణాలను ప్రాథమికంగా ఎలా గుర్తించవచ్చో పీహెచ్‌సీల్లో పనిచేసే ఏఎన్ఎంలకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. మూడు రోజుల శిక్షణను పూర్తి చేసుకున్న వైద్యనిపుణులు తదుపరి ఉమ్మడి జిల్లాలోని డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీలకు విడతలవారీగా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మాస్టర్ ట్రైనీలుగా ప్రభుత్వ వైద్యకళాశాల ఎస్‌పీఎం, పెథాలజీ, గైనిక్ విభాగాల ప్రొఫెసర్లు వ్యవహరించారు. సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు, ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ గంగాభవాని, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నరేంద్రకృష్ణ, డాక్టర్ రాజేష్, ఎపిడిమాలజిస్టు సుభాష్ పాల్గొన్నారు.

ములగలంపాడులో బంగారం చోరీ

ఏలూరు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంటిలోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన లింగపాలెం మండలంలో మంగళవారం జరిగింది. ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపిన వివరాలివి.. ములగలంపాడు గ్రామానికి చెందిన రెడ్డి వెంకన్న అతడి భార్య పనుల నిమిత్తం బయటకు వెళ్లగా దుండగులు ఇంటి తాళాలు పగులకొట్టి కాసున్నర బంగారం ఆభరణాలను తస్కరించినట్టు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఓటీపీలు వస్తేనే రిజిస్ట్రేషన్లు

తరచూ కొత్త విధానాలతో కక్షిదారుల అసంతృప్తి





కోట్ల రూపాయల ఆదాయం వస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ తరచూ కొత్త విధానాలను రూపకల్పన చేయడంతో క్రయవిక్రయదారులతో పాటు అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల 27వ తేదీ నుంచి ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌కు ఓటీపీ విధానం తీసుకొచ్చింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నప్పటికీ ఓటీపీ విధానానికే రిజిస్ట్రేషన్ శాఖ మొగ్గుచూపుతుంది. మొదటిలో కొంత ఇబ్బందులు ఉన్నప్పటికీ క్రమక్రమంగా సమస్యలు తొలగిపోతాయని రిజిస్ట్రేషన్ శాఖ ముందుకు వెళుతోంది. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఆధార్‌కు ఫోన్ నంబరు లింక్ కాకపోవడంతో ఓటీపీ అవస్థలు
- అయినా ఓటీపీ విధానానికే మొగ్గు చూపిన రిజిస్ట్రేషన్ శాఖ
- క్రయ విక్రయదారులు సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

ఆచంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రతిరోజూ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది. అటువంటి ఆదాయం వచ్చే శాఖపై రిజిస్ట్రేషన్ శాఖ కొత్తవిధానం తీసుకువస్తుండడంతో ముఖ్యంగా క్రయ విక్రయదారులతోపాటు అధికారులు తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి తరచూ కొత్త విధానాలు తీసుకువస్తుండడంతో ఇటీవల కాలంలో రిజిస్ట్రేషన్లు సజావుగా జరగడం లేదు. ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతుంది. అమ్మకం, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి 2.0 కొత్త విధానం తీసుకువచ్చింది. మొదటిలో అనేక మంది ఈ విధానం వ్యతిరేకించినప్పటికి క్రమక్రమంగా ఈ విధానానికి అలవాటు పడి రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. ఇటీవల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం తీసుకువచ్చింది. ఈ విధానం కూడా మొదటిలో కక్షిదారులు పెద్దఎత్తున అసంతృప్తి వ్యక్తం చేశారు.

కొత్తగా ఓటీపీ విధానం..

మళ్లీ కొత్తగా గతనెల 27 నుంచి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి క్రయ విక్రయదారులకు ఓటీపీ విధానం తప్పనిసరి చేసింది. ఈమేరకు క్రయ విక్రయదారులు ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమందికి ఆధార్‌కి మొబైల్ నంబరు లింక్ చేసుకోవడం లేదు. దీనివల్ల ఓటీపీలు రాక అవస్థలు పడుతున్నారు. కొంతమంది ఓటీపీలకు సంబంధించి వృద్ధాప్యం కలిగిన వారు వారి కుమార్తెలు, కుమారులకు మొబైల్ నంబరుకు లింక్ చేయడంతో వారి కుటుంబసభ్యులు వేరే దూరప్రాంతంలో ఉండడంతో మొబైల్ పని చేయని కారణం ఒకటి అయితే మరికొంతమంది ఓటీపీ ఎందుకని వారి కుటుంబ సభ్యులనే ప్రశ్నిస్తున్నారు. భూమి స్థలాలు ఇల్లు క్రయవిక్రయాలు జరపాలంటే ప్రస్తుతం రిజిస్ట్రేషన్‌శాఖ విధించిన ఓటీపీ విధానం వల్ల దస్తావేజుల్లో పొందు పరిచిన క్రయ విక్రయదారులకు తప్పనిసరిగా ఆధార్ ఓటీపీ వస్తేనే పబ్లిక్‌డేటా ముందుకువెలుతుంది. అలా కాకపోతే రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. కొంతమంది వారి కుటుంబ సభ్యులకు సంబంధించి పెండ్లి కానుకగా, అలాగే అనారోగ్య కారకంగా దస్తావేజులు ఓటీపీల వల్ల నిలిచిపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఓటీపీతోనే స్లాట్ బుకింగ్..

ఇది ఒక పద్ధతి అయితే దీనికి సంబంధించి స్లాట్ బుకింగ్ విధానంలో కూడా ఓటీపీ చెబితేనే స్లాట్ బుకింగ్ అవుతుంది. మరోసారి క్రయ విక్రదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గతనెల జూలైలో చేపట్టిన ఓటీపీ విధానం ద్వారా క్రయ విక్రయదారులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కోట్ల రూపాయలు ఆదాయం ఇచ్చే శాఖపైనే ఇటువంటి నిబంధనలు విధిస్తున్నారని కొంత మంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఓటీపీ విధానం వల్ల కొంతమందికి ఆధార్ లింక్ కాకపోవడంతో క్రయ విక్రయదారులు ఆధార్ సెంటర్‌లకు క్యూ కడుతున్నారు. ఓటీపీ విధానం ద్వారా ఇటీవల కాలంలో రిజిస్ట్రేషన్లు ఎక్కడా కూడా సజావుగా సాగడం లేదు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబంలో తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధికారులు స్పందించి తక్షణమే తరచూ రిజిస్ట్రేషన్‌లో కొత్త విధానాలను తీసుకురాకుండా ఇటీవల ప్రవేశపెట్టిన కొత్త విధానాన్ని సవరించి సజావుగా రిజిస్ట్రేషన్‌లు అయ్యేట్లు చూడాలని పలువురు కక్షిదారులు కోరుతున్నారు.

పోలీస్ శాఖ ప్రచారం..

ఓటీపీ విషయంలో ప్రజలందరూ సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఇప్పటికే పోలీసు శాఖ వారు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. చరవాణిలో కూడా సైబర్ నేరగాళ్ల పట్ల ఓటీపీ విషయంలో ఎవరికి చెప్పవద్దంటూ పదేపదే చెబుతున్నారు. బ్యాంక్ అధికారులు కూడా ఓటీపీ ఎవరికి చెప్పవద్దంటున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో రిజిస్ట్రేషన్ శాఖ కొత్తగా ఓటీపీ విధానం ఎందుకు తీసుకువచ్చిందంటూ కక్షిదారులే ప్రశ్నిస్తున్నారు.

'సూర్యఘర్ పథకం'పై అవగాహన కల్పించాలి

- ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ సూర్యప్రకాశ్



డిప్యూటీ స్పీకర్ రఘురామతో విద్యుత్ శాఖ డైరెక్టర్ సూర్యప్రకాశ్, తదితరులు

భీమవరంటౌన్/కాళ్ల,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ప్రతి వినియోగదారుడు సూర్యఘర్ పథకంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ టి. సూర్యప్రకాశ్ ఆదేశించారు. ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా భీమవరం వచ్చిన ఆయన ఎస్ఈ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో విద్యుత్. వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేసేందుకు అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఏ సబ్ స్టేషన్లపరిధిలో అంతరా యాలు వస్తునాయో ప్రశ్నించారు. కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్తు సబ్‌స్టేషన్‌ల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను సిబ్బంది సత్కరించారు. ఈఈ ఎన్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును మర్యాద పూర్వకంగా కలిశారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన విద్యుత్ శాఖ అధికారులు

డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజును మంగళవారం కాళ్ల మండలం పెద అమిరంలోని ఆయన కార్యాలయంలో ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ టీవీ సూర్యప్రకాశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ పరిధిలోని పలు సమస్యలపై చర్చించారు. ఆకివీడు మండలం పెదకాపవరంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని, ఉండి నియోజకవర్గంలో లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించి, నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం ఇవ్వడానికి చర్యలను తీసుకోవాలని కోరారు.

క్రైం సమాచారం


మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): అపెండిస్ ఆపరేషన్ చేసినప్పటికీ ఇంకా కడుపునొప్పి రావడంతో ఓ యువకుడు మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దెందులూరు మండలం మసీదుపాడు గ్రామానికి చెందిన కొరపాటి అజయ్‌బాబు (19)కి కడుపులో నొప్పి రావడంతో అపెండిస్ ఆపరేషన్ చేశారు. అయినప్పటికి కడుపునొప్పి తగ్గకపోవడంతో ఈనెల 2వ తేదీన పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతను మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారమిచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ చదువుతున్న ఒక విద్యార్థి సబ్జెక్టులు ఫెయిల్ కావడతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందుతాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో 42 రోజుల నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. చింతలపూడి మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆత్రు మహేశ్వరరావు, రజని దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన ఆత్రు ప్రేమ్‌సాయి(18) పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని సబ్జెట్లు ఫెయిల్ కావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై చింతలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



తస్వీర్ మృత దేహం

మొగల్తూరు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం బీచ్‌లో ఈనెల 4వ తేదీన సముద్ర స్నానానికి దిగిన బి.తస్వీర్ మృతదేహం కృష్ణా జిల్లా చిన్నగొల్లపాలెం తీరంలో మంగళవారం విగత జీవిగా కొట్టుకు వచ్చింది. భీమవరంలోని ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులు ఆటపాటగా గడిపేందుకు సోమవారం పేరుపాలెం సాగరతీరానికి చేరుకున్నారు. సముద్ర స్నానానికి దిగిన ఈ విద్యార్థుల్లో బి.తస్వీర్ అనే విద్యార్థి గల్లంతయ్యాడు. మంగళవారం కృష్ణాజిల్లా చిన్నగొల్లపాలెం తీరంలో తస్వీర్ మృతదేహం కొట్టుకురావడంతో మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

రెండు కార్లు ఢీ.. తప్పిన ముప్పు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

కైకలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలో కైకలూరు మండలం ఆలపాడులో రెండు కార్లు ఢీకొన్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున కొంతమేరకు రహదారి అభివృద్ధి పనులు చేసి మధ్యలో వదిలివేయడంతో వేగంగా కైకలూరు నుంచి ఆకివీడు వెళ్తున్న కారు రహదారి గోతుల్లో పడి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. ఈమేరకు రెండు కార్లకు ముందుభాగాలు నుజ్జునుజ్జుఅయ్యాయి. కారులో ప్రయణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. రహదారి నిర్మాణ పనుల్లో హెచ్చరిక బోర్డులు లేకపోవడంతోనే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. ఆటో డ్రైవర్ మృతి



స్తంభాన్ని ఢీకొట్టడంతో ధ్వంసమైన కారు ముందుభాగం

ద్వారకాతిరుమల, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ఓ భక్తుని కారు ఆటోను వేగంగా ఢీకొట్టడంతో ఆటో తిరగబడి తీవ్రగాయాలైన ఆటో డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రి శివారులో మంగళవారం జరిగింది. ద్వారకాతిరుమల ఎస్ఐ టి.సుధీర్ తెలిపిన వివరాలివి.. పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన చొదిమెళ్ల విజయరాజు(40) మంగళవారం తన ఆటోలో ఎన్టీఆర్ వైద్యసేవపై ప్రచారం చేస్తూ ద్వారకాతిరుమల నుంచి భీమడోలు వైపునకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో చైన్నై నుంచి సురేష్ అనే భక్తుడు కుటుంబంతో కలిసి దైవదర్శనం నిమిత్తం ద్వారకాతిరుమలకు వస్తున్నాడు. ఘటనాస్థలం వద్దకు వచ్చేసరికి కారు వేగంగా ఆటోను ఢీకొట్టడంతో బోల్తాకొట్టింది. అనంతరం వేగాన్ని అదుపుచేసుకోలేక కారు కరెంటు స్తంభాన్ని ఢీకొని పాక్షికంగా ధ్వంసమైంది. ఆటోను నడుపుతున్న విజయరాజు తీవ్రగాయాలు కాగా ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి కోసం కాలువలో గాలింపు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలోని ఓ వృద్ధురాలు కనిపించకపోవడంతో ఆమె కోసం ఏలూరు కాలువలో పోలీసులు, అగ్నిమాపక అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. స్థానిక జువ్వలపాలెంకు చెందిన రావి చంద్రావతి అనారోగ్యంగా ఉండడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం ఆమెకు కేన్సర్ ఉందని రిపోర్టు వచ్చింది. ఈ మేరకు ఆమె మనోవేదనకు గురై సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంటి సమీపంలోని ఏలూరు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఏలూరుకాలువలో బోటుతో గాలింపు ముమ్మరంగా చేపట్టారు. ఈ మేరకు వృద్ధురాలి మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

ఆలయంలో బంగారు ఆభరణాల చోరీ

కామవరపుకోట,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):తడికలపూడిలోని గ్రామదేవత ఆలయమైన గంగానమ్మ, అంకాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు బద్దలు కొట్టి వెండి, బంగారు ఆభరణాలను అపహరించినట్టు ఆలయ నిర్వాహకులు తడికలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పి.చెన్నారావు ఏలూరు నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను తీసుకువచ్చి సమగ్ర పరిశీలన చేశారు. వివరాలు తెలియాల్సి ఉంది.

పది మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

- నలుగురికి మూడు రోజుల పాటు సేవలు చేయాలని ఆదేశం
- మరో ముగ్గురికి రూ.3 వేలు చొప్పున జరిమానా

ఏలూరు క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆదేశాలతో ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు వారి సిబ్బంది కలిసి ఈనెల 2వ తేదీన పాతబస్టాండ్ వద్ద స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన పది మందిపై కేసులు నమోదు చేశారు. వారిలో ఏడుగురికి రెండో తరగతి మేజిస్ట్రేట్ కోర్టుకు మంగళవారం హాజరుపరిచారు. వీరిలో నలుగురిని మూడు రోజుల పాటు సామాజిక సేవలు చేయాలని మేజిస్ట్రేట్ కేవీఆర్ మల్లేశ్వరి ఆదేశాలు జారీ చేశారు. మరో ముగ్గరికి ఒకొక్కరికి మూడు వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు. మరో ముగ్గరిని కోర్టుకు హాజరు పర్చాల్సి ఉందన్నారు.

దారికి అడ్డుగా ఉన్నాడని ఒకరిపై దాడి.. కేసు నమోదు

ఏలూరు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై అడ్డుగా ఉన్నాడంటూ ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడిచేసి గాయపరచిన ఘటన లింగపాలెం మండలం మఠంగూడెంలో జరిగింది. ఎస్ఐ కె.వెంకన్న తెలిపిన వివరాలివి.. మఠంగూడెం గ్రామానికి చెందిన ఎస్.నాగబాబు అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అదే గ్రామానికి చెందిన జి.అశోక్ అనే వ్యక్తి దారిలో అడ్డుగా ఉన్నాడు. ఈ మేరకు అతడిపై దుర్భాషలాడుతూ ఎస్.నాగబాబు, ఎస్.భీమసేన అనే ఇద్దరూ అశోక్‌పై దాడి చేయడంతో అతడి తలకు తీవ్ర గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరక నాగరాజుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు.



జీవో 137 ఉపసంహరించాలని ఈయూ నాయకుల నినాదాలు

ఆర్టీసీ ఆస్తులను ధారాదత్తం చేస్తే ఊరుకోం

- ఈయూ రీజనల్ కార్యదర్శి రాంబాబు హెచ్చరిక

ఏలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):ప్రజారవాణా(ఆర్టీసీ) ఆస్తులను ప్రైవేట్ వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేస్తే ఊరుకునేది లేదని, ఐక్యంగా ఉద్యమిస్తామని ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) రీజనల్ కార్యదర్శి బి.రాంబాబు అన్నారు. ఏలూరు జిల్లా కేంద్రం ఏలూరులోని కపర్థి భవన్‌లోని ఈయూ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ గవర్నర్‌పేట డిపోలు, పాతబస్టాండ్‌కు సంబంధించిన 15 ఎకరాలు కలిపి రూ.400 కోట్ల విలువైన స్థలం లులూ షాపింగ్‌మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తోందన్నారు. ఈ రెండు డిపోల పరిధిలో 1,100 మంది ఉద్యోగులను ప్రజలకు దూరం చేయాలన్న కుట్రలను భగ్నం చేస్తామన్నారు. వెంటనే స్థలం కేటాయింపు జీవో 137 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ ప్రభుత్వ పెద్దలే 2014లో విజయవాడ ఆర్టీసీ ట్రైనింగ్ కళాశాల స్థలం 29 ఎకరాలను హెచ్‌ఈఎల్ కంపెనీకి కట్టబెట్టారని, అందుకు బదులుగా ప్రభుత్వం ఇస్తామన్న స్థలం ఇప్పటివరకు ఒక్క గజం ఇవ్వలేదని గుర్తుచేశారు. ఆర్టీసీని కాపాడుకునేందుకు ఏ పోరాటాలకైనా సిద్ధంగా ఉంటామని తెలిపారు. కేవీ రాఘవులు, వై.శ్రీనివాస్, టి.ఆంజనేయులు, టి.బాబూరావు, పాండు, నూజివీడు సెక్రటరీ కుమార్ పాల్గొన్నారు.

కన్నడపై శిక్షణకు రంగాపురం టీచర్ ఎంపిక



సాయిలక్ష్మి

ముదినేపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మైసూర్ సదరన్ రీజినల్ లాంగ్వేజ్ సెంటర్ నిర్వహిస్తున్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్‌లో కన్నడ భాషపై శిక్షణ పొందేందుకు ముదినేపల్లి మండలం రంగాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ముండూరు సాయిలక్ష్మికి అవకాశం లభించింది. ఈ ఇనిస్టిట్యూట్‌లో కన్నడ భాషపై 10 నెలల డిప్లొమో కోర్సులో శిక్షణ పొందేందుకు ఆమెను ఎంపిక చేస్తూ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణకు ఇటీవల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా సాయిలక్ష్మి కన్నడ భాషలో శిక్షణకు దరఖాస్తు చేశారు.

సినీ నిర్మాత డాక్టర్ డీవీఎస్ రాజు మృతి

- పోడూరులో విషాదఛాయలు



డీవీఎస్.రాజు (ఫైల్)

పోడూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాత, సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దాట్ల వెంకట నరసింహరాజు (డీవీఎస్ రాజు)(88) మంగళవారం హైదరాబాదులోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. ఆయన స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా పోడూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మెడికల్ విద్యనభ్యసించి మద్రాసులో వైద్యుడిగా స్థిరపడ్డారు. దివంగత ఎన్టీఆర్, ఎంజీఆర్ వంటి ప్రముఖులకు ఆయన వైద్యసేవలందించారు. ఆయన హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడు ఎన్టీఆర్‌తో సినిమా తీయాలన్న సంకల్పం బలంగా ఉండడంతో వైద్యవృత్తి చేస్తూ సినీ ప్రముఖులతో పరిచయాలు పెంచుకుంటూ చివరకు ఎన్టీఆర్‌తో 'సింహబలుడు, కలియుగదైవం' సినిమాలు తీశారు. సూపర్‌స్టార్ కృష్ణతో 'జయం మనదే', చిరంజీవితో 'ఇంటి గుట్టు' సినిమా తీశారు. సెన్సార్ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. ఆయనకు భార్య ఉదయ్, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, బంధుమిత్రులు ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. పోడూరు గ్రామానికి చెందిన ఆయన కుటుంబ సభ్యుడు రుద్రరాజు విజయరామరాజు మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటే ఎంతో అభిమానమని వైద్య వృత్తి చేస్తూ ఎన్టీఆర్‌తో సినిమా తీయాలనే కలను నెరవేర్చుకున్నారన్నారు.

పూలపల్లిలో గ్యాస్ లీకై మంటలు



పూలపల్లిలో గ్యాస్ లీకై వ్యాపించిన మంటలు

పాలకొల్లురూరల్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామంలో మంగళవారం గంటా సత్తిబాబు ఇంట్లో వంట చేస్తుండగా రెగ్యులేటర్ సరిలేకపోవడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు భయభ్రాంతులకు గురై ఫైర్‌స్టేషన్‌కు సమా చారం అందించారు. ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి అధికారి కె.శ్రీనివాసు సిబ్బందితో పాటు హెచ్‌సీ గ్యాస్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈమేరకు ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రూ.20 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి అధికారి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి

పెంటపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : రైతులు ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఏడీఏ ఆర్.గంగాధర్ అన్నారు. మంగళవారం ఆకుతీగపాడు రైతు సేవా కేంద్రం వద్ద రాష్ట్రీయ కృషి వికాస యోజన(ఆర్‌కేవీవై) కార్యక్రమంలో భాగంగా ఏవో చీర్ల రవికుమార్ అధ్యక్షతన రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ గంగాధర్ మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలన్నారు.

డ్రెయిన్‌లో కిక్కిస తొలగింపు

మొగల్తూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దర్బరేవు డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్త, తూడు, కిక్కిసలను ప్రభుత్వం స్పందించకపోవడంతో మంగళవారం ఆయకట్టు పరిధిలోని ఆక్వా రైతులే డబ్బులు సమీకరించుకుని స్వచ్ఛందంగా తొలగింపు చేపట్టారు. రెండు దశాబ్దాలుగా డ్రెయిన్ ప్రక్షాళన చేయాలని ముంపునీరు లాగే విధంగా సహకరించాలని ఆయకట్టు రైతులు అనేక ఆందోళనలు చేసినా, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా స్పందన కొరవడింది. దీనితో రైతులే పనులు చేసుకున్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర



గరగ నృత్యం చేస్తున్న ఏపీ ఐఐసీ చైర్మన్ రామరాజు

కాళ్ళ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జువ్వలపాలెంలో పైడితల్లి అమ్మవారి 79వ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, హైదరాబాద్ ప్రాంతాల నుంచి యాత్రికులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు అమ్మవారిని దర్శించుకుని, జాతర సందర్భంగా గరగ నెత్తిన పెట్టుకుని కాసేపు నృత్యం చేశారు. టీటీడీ మాజీ సభ్యులు గోకరాజు రామరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

69 శాతం నాట్లు పూర్తి

ఆచంట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో 60 శాతం పైగానే సార్వా నాట్లు పూర్తయినట్లు మండల వ్యవసాయాధికారి బి. నాగరాజు తెలిపారు. మంగళవారం పెనుమంచిలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో నాగరాజు మాట్లాడుతూ ప్రతి రైతు పంటల బీమా నిమిత్తం వెంటనే ఇన్సూరెన్స్ కోసం సొమ్ము చెల్లించాలన్నారు. రైతులు అధికంగా ఎరువులు వాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గణేషుల శేషవాణి పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లు ఆకస్మిక తనిఖీ



తణుకులోని ప్రైవేట్ ఆస్పత్రిలో డీఎంఅండ్‌హెచ్‌వో తనిఖీ

తణుకు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తణుకులోని పలు స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి జి.గీతాబాయి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలో సుధా ఆసుపత్రి, సుప్రజ, విఘ్నేష్ టెస్టు ట్యూబ్ బేబి సెంటర్‌లను తనిఖీ చేశారు. సత్యవతి నర్సింగ్ హోమ్, భాగ్యశ్రీ ఆసుపత్రిలోని స్కానింగ్ సెంటర్‌లను తనిఖీ చేశారు.

గణపవరం: సీజనల్ వ్యాధుల నివారణకు ఆశావర్కర్లు అంకితభావంతో కృషి చేయాలని జిల్లా వైద్యఆరోగ్య శాకాధికారి జీ.గీతాబాయి కోరారు. పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల సదస్సులో పాల్గొన్న గీతాబాయి మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ సేవలను సత్వరం అందేలా చూడాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీదివ్య, బీహెచ్‌ఎన్ అన్నకుమారి పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు, ట్రూఅప్ చార్జీలు విరమించాలి

తణుకు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలు పెంచడం విరమించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు బి.బలరామ్, కోనాల భీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నరేంద్ర సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బొద్దాని నాగరాజు, పుష్పకుమారి, పీవీ, ప్రతాప్, అజయకుమారి, గుబ్బల గోపి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: స్మార్ట్ మీటర్లు ప్రజలకు ఆర్థికంగా భారమవుతాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దు, పెరిగిన విద్యుత్ చార్జీల తగ్గింపు డిమాండ్‌లతో మంగళవారం పెనుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ అనిత కుమారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వల్ల విద్యుత్‌బిల్లులు పెరిగే అవకాశం ఉందన్నారు. స్మార్ట్ మీటర్లు గోప్యత, భద్రత సమస్యలను కలిగిస్తాయన్నారు

పాలకొల్లు అర్బన్: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం స్మార్ట్ మీటర్లు వద్దని, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నానుద్దేశించి దిగుపాటి రాజ గోపాల్ మాట్లాడారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, నేడు గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తున్నారని అన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలను నిలువునా దోచుకుంటున్న స్మార్ట్ మీటర్‌లు రద్దు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ పొల్నూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని జగన్నాథపురం సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు.

ఇరగవరం: కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంగా ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఇప్పుడు స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని ప్రోత్సహిస్తున్నదని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కామన మునిస్వామి విమర్శించారు. ఇరగవరం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా వేదిక సంఘాలు నాయకులు ఇల్లందపరతి సత్యనారాయణ, జుతీగ రామాంజనేయులు, పిల్లి కోటేశ్వరరావు, దంపనబోయిన కనకేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



ఆకివీడులో బాలింతలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఆచంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగించడం ద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి ఎస్. వినోద్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్, సూపర్‌వైజర్‌లు ఎం. శ్యామలాంబ, డి. సూర్య కుమారి, టి.పోచమ్మ, పీహెచ్‌ఎస్ సరోజిని పాల్గొన్నారు.

తణుకు రూరల్: కోనాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మీ పాల్గొని అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.

అత్తిలి: బల్లిపాడు గ్రామంలో ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు వల్ల బిడ్డకు ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధులను కూడా దూరం చేయవచ్చునని అన్నారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: తల్లిపాలే చంటి పిల్లలకు సంజీవని వంటిదని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీహర్ష పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీ భవనం నుంచి గ్రామంలో తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.ఎస్తేరురాణి, హెచ్‌వీ మెర్సి, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు: శిశువు ఎదుగుదలకు తల్లిపాలు పూర్ణ పోషకహారమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి అన్నారు. మంగళవారం పలు అంగన్‌వాడీ సెంటర్ల దగ్గర బాలింతలతో కలిసి తల్లిపాలు ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

స్వమిత్వ సర్వేకు శ్రీకారం

(5వ పేజీ తరువాయి)

నిర్వహించినప్పటికీ ప్రజల నుంచి అంతగా సానుకూలత రాలేదు. ఇప్పుడు ముందస్తు గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. ప్రజలను చైతన్య పరుస్తున్నారు. సర్వే వివరాల ఆధారంగా గ్రామకంఠంలోని హక్కు లేకుండా వున్న స్థల, ఇంటి యజమానులకు పీపీఎన్ నెంబర్, కార్డు ద్వారా హక్కు లభిస్తుంది. తద్వారా వారికి బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం ఏర్పడుతుంది. భద్రతా ప్రమాణాలతో కూడిన యాజమాన్య ఆస్తి ధృవపత్రాన్ని పొందనున్నారు.







పాలకొల్లులో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల.. ఉండిలో డిప్యూటీ స్పీకర్ ఆర్ఆర్ఆర్‌కు సన్మానం.. ఎమ్మెల్యే ఆరిమిల్లిని కలిసిన ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులు

నియోజకవర్గాల అభివృద్ధే లక్ష్యం

పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ప్రథమస్థానంలో నిలపాలన్నదే తన ధ్యేయమని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులోని తన కార్యాలయంలో మంగళవారం కూటమి నాయకులతో కలిసి మంత్రి నిమ్మల మాట్లాడారు. పార్టీ పరంగా ప్రభుత్వ పరంగా ఎన్ని కార్యక్రమాలు ఉన్నప్పటికీ పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్నానన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అన్నిశాఖల నుంచి మొత్తంగా 952 పనులకు 450 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు.

దాడులు చేయడం వైసీపీ విష సంస్కృతి

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలపై దాడి చేయడం వైసీపీ విష సంస్కృతికి నిదర్శనమని మంత్రి అన్నారు. గతంలో వైసీపీ చేసిన పాలనలో జగన్ పత్రికలో సత్యాలు దాచి పెట్టి, అసత్యాలను వండివార్చడం ఆపత్రిక నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, కూటమి నాయకులు ఉన్నమట్ల కపర్థి, పెచ్చెట్టిబాబు, గండేటి వెంకటేశ్వరరావు, బోనం చినబాబు, పాముల రజనీ, గొట్టుముక్కల సూర్య నారాయణ రాజు పాల్గొన్నారు.

ఉండిని తీర్చిదిద్దుతా: డిప్యూటీ స్పీకర్

ఉండి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉండి మేజర్ పంచాయతీని మునిసిపాలిటీ స్థాయికి పెరిగే విధంగా అభివృద్ధి చేస్తానని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్‌ను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు రామలక్ష్మీ అధ్యక్షత వహించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ పాఠశాలలో ఎన్నో అభివృద్ధి పనులను చేశామంటూ గుర్తుచేశారు. అలాగే నియోజకవర్గం ప్రధాన కేంద్రంగా వున్న ఉండిని అభివృద్ధిపరచడానికి తాను ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఆక్రమణలను తొలగించి అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఏపీఐఐసీ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు మంతెన రామరాజు, పూర్వపు విద్యార్థి జీవీఎస్ఎన్‌రాజును సత్కరించారు.



దేగాపురం రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

రోడ్డు పనుల పరిశీలన

భీమవరం టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఐదో వార్డు పరిధిలోని నరసయ్య అగ్రహారంలో సుమారు రూ.3.70 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డివైడర్, డ్రెయినేజీ నిర్మాణ పనులను కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఇంజనీర్ త్రినాథరావు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మకు రోడ్డు పనులు జరుగుతున్న వివరాలు తెలియజేశారు.

వాడుకలో లేని చెరువుల అభివృద్ధి

ఆకివీడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా పట్టణ పరిధిలో వాడుకలో లేని చెరువులను అభివృద్ధి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు తెలిపారు. మంగళవారం స్థానిక కొండయ్య చెరువుకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. ఏళ్ళ తరబడి వాడుకలో లేకుండా ఆక్రమణలకు గురై పూడుకుపోయిన దొరగారి, కొండయ్య మంచినీటి చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాపవరం రోడ్ నుంచి కొండయ్య చెరువుకు వెళ్ళేందుకు రహదారి, గాలిబ్ చెరువు నుంచి కొండయ్య చెరువుకు పైపులైను వేయాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా పాల్గొన్నారు. గుమ్ములూరులో అశ్విని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని డిప్యూటీ స్పీకర్ ప్రారంభించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం సానుకూలం

తణుకు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెరగడంతో మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో సుమారు 57మంది ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు పెంచడం జరిగిందన్నారు. కార్మికులు కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

దేగాపురం- కొమరాడ రోడ్డుకు శంకుస్థాపన

భీమవరం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం దేగాపురం నుంచి కొమరాడ రోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శంకుస్థాపన చేశారు. రూ. 1.14 కోట్లతో నాబార్డు నిధులతో 1350 మీటర్ల సీసీ రోడ్డు, బీటీ రోడ్డును వేస్తున్నామని తెలిపారు. 45 రోజుల్లోగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని అన్నారు.





పెంటపాడులో మాట్లాడుతున్న డీపీవో రామనాథ్‌రెడ్డి.. తాడేపల్లిగూడెంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి

వాట్సాప్ గవర్నెన్స్‌తో అనేక సేవలు

పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు

తాడేపల్లిగూడెం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో 1వ వార్డు సచివాలయంలో మంగళవారం ప్రజల చేతిలో ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా ప్రజల్లో అవగాహన పెంచేలా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవలను అందించడానికి నిర్ణయం తీసుకుందన్నారు. ఈ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 500కు పైగా సేవలను పౌరులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, తహసీల్దార్ సునీల్‌కుమార్, కూటమి నాయకులు వర్తనపల్లి కాశీ, పాలూరి వెంకటేశ్వరరావు, చాపల రమేష్ పాల్గొన్నారు.

పెంటపాడు: వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డీపీవో ఎస్.రామనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెంటపాడుగ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గేటు సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీపీవో రామ్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు తమకు అవసరమైన పనులను తమ ఫోన్ నుండే చేసుకోవచ్చునన్నారు. అడంగళ్, రైతుకార్డులు, విద్యుత్ బిల్లులు తదితర వాటిని ఎక్కడికి వెళ్ళకుండా తమ వద్ద నుండే పొందవచ్చునన్నారు. ప్రజల సమయాన్ని వృధా కాకుండా చేసేందుకే వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ, కార్యదర్శి గోడి బాలకృష్ణ, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, కళింగ లక్ష్మణరావు, తాడేపల్లి ఈశ్వరయ్య, కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: వాట్సాప్ గవర్నెన్స్ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి అన్నారు. పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజల చేతిలో ప్రభుత్వం వాట్సాప్ యాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె. శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ జి.భార్గవ్ నాయుడు, జెఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువగా తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం వినూత్నంగా సేవలందిస్తుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం వెంకటేష్ పేర్కొన్నారు. కుంచనపల్లిలో వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందించే సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యదర్శి ఆర్‌వి బ్రహ్మం, ఎంఆర్‌సీ ఎం రవికిరణ్ పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: వైఎస్‌పాలెం గ్రామంలో మంగళవారం సర్పంచ్ వైఎస్ నాగముత్యామాంబ ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనికి ఆర్డీవో దాసిరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ యాప్‌ను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. అనంతరం స్కూల్‌లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సచివాలయంలో జరుగుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ, వైఎస్ బాబులు, వాసు, వీఆర్వో చిరంజీవి పాల్గొన్నారు.

ఆకివీడు రూరల్: మన మిత్ర వాట్సాప్ నెంబరు 95523 00009 ఉపయోగించుకుని లబ్ధిపొందాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావు అన్నారు. గుమ్ములూరు గ్రామంలో సభ నిర్వహించి, ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై సందేహాలు నివృత్తి చేసుకోవడం, ఫిర్యాదు చెయ్యడం చేసుకోవచ్చునని తెలిపారు. ఆర్‌ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం, సరిపల్లె, జల్లికొమ్మర, వెలగపల్లి, వరదరాజపురం గ్రామాల్లో పల్లెపల్లెకు - పత్సమట్ల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ప్రజల చేతిలో ప్రభుత్వం లక్ష్యంగా రాష్ట్రంలో తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలంతా ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని ఆయన కోరారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు, గణపవరం మండల ఇన్‌ఛార్జ్ వంగా రఘు, మండల జనసేన అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, సర్పంచ్‌లు మూరా అలంకారం, భాస్కరరావు, ననుమూరి లక్ష్మీభవాని పాల్గొన్నారు.


పోడూరు త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకరణ



పోడూరు సొసైటీ చైర్మెన్ పురుషోత్తముడును అభినందిస్తున్న పితాని వెంకట్

పోడూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పోడూరు సొసైటీ చెర్మన్‌గా తంగెళ్ల పురుషోత్తముడు, సభ్యులుగా అల్లూరి శ్రీనివాసరాజు, తోలేటి వేణు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వీరిని ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్ అభినందించారు. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు రుద్రరాజు రవి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ రుద్రరాజు రమేష్‌రాజు, ఉపసర్పంచ్ శీలబోయిన జయరామకృష్ణ, మండల గౌడసంఘం అధ్యక్షుడు గుబ్బల అప్పన్నస్వామి. కార్యదర్శి ఊడిగ శ్రీనివాసరావు, సొసైటీ కార్యదర్శి ఆర్.కృష్ణంరాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్‌వో మృతి



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో వీఆర్‌వోగా పనిచేస్తున్న ఎం.దేవరాజు (54) గుండెపోటుతో మంగలవారం మృతి చెందారు. ఇంటి వద్ద వాకింగ్ చేస్తున్న క్రమంలో దేవరాజు గుండెపోటుతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన మృతికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, తహసీల్దార్ ఎం సునీల్‌కుమార్, తదితరులు సంతాపం తెలిపారు.

రేషన్ పంపిణీ కేంద్రం ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎల్ అగ్రహారంలోని టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద స్థానికుల అభ్యర్థన మేరకు రేషన్ పంపిణీ కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వాడపల్లి వెంకట సుబ్బరాజు, పాలూరి వెంకటేశ్వరరావు, వర్తనపల్లి కాశీ, ఎన్‌వి సత్యనారాయణ, తహసీల్దార్ ఎం సునీల్‌కుమార్, కమిషనర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్మికులకు భద్రత కల్పించాలి

తణుకు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రవాణా రంగంలో నూతనంగా ప్రైవేటు సంస్థల ద్వారా అమలు చేస్తున్న ఆటోమేటిక్ ఫిట్‌నెస్ టెస్టింగ్ విధానంతో కార్మికులకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని కార్మికులు వాపోయారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా జాయింట్ యాక్షన్ కమిటి నాయకులు ఎమ్మెల్యే రాధాకృష్ణకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఏటీఎస్ విధానంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, కార్మికుల భద్రతకు కలిగే ముప్పు గురించి వివరించారు. గతంలో మాదిరిగానే వాహన ఫిట్‌నెస్ పరీక్షలు రవాణా అధికారుల సమక్షంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

చెన్నకేశవ స్వామి పాలకవర్గం ప్రమాణ స్వీకారం

పెనుగొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పెనుగొండలోని చెరుకువాడ చెన్నకేశవ స్వామి దేవస్థానం కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఛైర్మన్‌గా కౌరు శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా మునుబర్తి శ్రీమణి, అడబాల చంద్రావతి, అడవి శ్రీలత, తమ్మినేని శ్రీదేవి, రాపాక నాగరాజు, కాకి వెంకటలక్ష్మి,కడలి సుబ్రహ్మణ్యం ప్రమాణస్వీకారం చేశారు. వీరిని ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ నక్కా వేద వ్యాస శాస్త్రి, సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, ఏఎంసీ ఛైర్మన్ బడేటి బ్రహ్మాజీ, కటికిరెడ్డి నానాజీ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల పాలకవర్గం ఎన్నిక

అత్తిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అత్తిలి ఎస్‌వీఎస్‌ఎస్ ఆర్ట్స్ సైన్స్ కళాశాల సంఘం సర్వసభ్య సమావేశం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. పాలకవర్గ అధ్యక్షులుగా దాసం గోవిందరావు, ఉపాధ్యక్షులుగా బుద్ధరాతి భరణి ప్రసాద్, కార్యదర్శిగా మద్దాల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి దిరిశాల సూర్య ప్రభాకరరావు, కోశాధికారిగా యడ్లపల్లి భద్రం, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 36 మందిని పాలకవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బీవీ రమణమూర్తి, పి శ్రీరామ్‌శర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ షబానా పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి



సైకిల్ షెడ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ మురళీ

నరసాపురం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చదువులో రాణించాలంటే విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ బళ్ళ మురళీ అన్నారు. మంగళవారం సారవ గ్రామంలో తను చదువుకున్న స్కూల్‌కు తనవంతు సాయంగా సైకిల్ షెడ్, బెంచీలు, బల్లలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాల నాగమణి, చైర్మన్ వెంకటేశ్వరావు, కడలి పార్వతి, దుర్గాప్రసాద్, రాంబాబు, ఆనందరాజు పాల్గొన్నారు.





భీమవరం, తాడేపల్లిగూడెంలలో వినతి పత్రాలు అందిస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం టౌన్/ తాడేపల్లిగూడెం/ నరసాపురం/ తణుకు రూరల్/ ఆచంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కరించాలంటూ భీమవరం కలెక్టరేట్ వద్ద ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో విలేకరులు మంగళవారం డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు వీఎస్ సాయిబాబా, ఎలక్ట్రానిక్స్ మీడియా జిల్లా అధ్యక్షుడు జక్కంశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రంశెట్టి గిరిజాపతి, లింగమూర్తి తదితరులు వినతిపత్రం అందజేశారు. తాడేపల్లిగూడెం రెవెన్యూ కార్యాలయం వద్ద యూనియన్ జిల్లా శాఖ, జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యడ్లపల్లి మురళీకృష్ణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మిశెట్టి రంగసురేష్, గొలిమే బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. నరసాపురంలో జర్నలిస్టుల సమస్యల్ని పరిష్కరించాలంటూ మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఆర్డీవో దాసిరాజుకు వినతిపత్రం అందించారు. ఇజ్రాయిల్, మారుతి, వెంకటేశ్వరావు, చిన్నారావు, రంగ, రాంబాబు కుమార్, చెరుకూరి రాజేష్ సందీప్, బాబు, మురళీ, జీవన్‌లు పాల్గొన్నారు. ఆచంటలో తహసీల్దార్ జి. కనకరాజుకు నియోజకవర్గ ప్రింట్‌అండ్‌ఎలక్ట్రానిక్ పాత్రికేయులు వినతిపత్రం అందించారు. తొలుత సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టులు ఆందోళ చేశారు. తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద తణుకు ఏరియా జర్నలిస్టులు ఆందోళన చేశారు. పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి బెల్లకొండ బుచ్చి బాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా భాస్కర్, జిల్లా మాజీ కార్యదర్శి కొడమంచిలి కృష్ణ, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

భీమవరం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రధానోపాధ్యాయుడు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ పిలుపునిచ్చారు. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ప్రారంభమైన 4 రోజుల లీడర్ షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమన్నారు. ట్రైనింగ్ సెంటర్ కో-ఆర్డినేటర్, ఏఎంవో సీహెచ్.ఎస్‌వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 215 మంది ప్రధానోపాధ్యాయులకు మొదటి విడతలో శిక్షణనిచ్చినట్లు తెలిపారు.

బోధనా పరికరాలతో విద్యా బోధన చేయాలి

పాలకోడేరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంచే విధంగా ఉపాధ్యాయులు బోధన పరికరాలను వినియోగిస్తూ విద్యాబోధన చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మోగల్లు గ్రామంలోని అల్లూరి సీతారామరాజు జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో మిషన్లు, త్రీడీ ప్రింటర్, వెల్డింగ్ మిషన్, షోల్డరింగ్ టూల్స్ తదితర సైన్స్ యంత్ర పరికరాలను పరిశీలించారు. సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అభియాన్ ఆఫీసర్ పి.శ్యాంసుందర్, తహసీల్దార్ విజయలక్ష్మీ, ఎంఈవో టీవీఎస్ నాగరాజు, ఇన్‌చార్జి హెచ్‌ఎం జేవీవీ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్లు

నరసాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. చివరి రోజున 12 మంది నామినేషన్లను ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోసఫ్‌కు అందించారు. ఈనెల 13న జరిగే ఎన్నికలో మొత్తం 24 మంది అభ్యర్థులు బరిలో ఉండే అవకాశం ఉన్నది. బుధవారం నామినేషన్ల పరిశీలన, గురువారం నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు.